నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఐడీపీఎల్ సబ్ స్టేషన్ శివాలయం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్ఎస్ బాలానగర్, బాలానగర్, శివాలయం వీధి, రైల్వే కాలనీ గేట్, హనుమాన్ టెంపుల్, సమతా నగర్, కేతన్ స్టీల్ ట్రేడర్స్, రైల్వే కాలనీ, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఎస్‌వీసీఐఈ ఫీడర్ పరిధిలో ఐడీపీఎల్ పరిశ్రమ, ఎస్ఎస్ బాలానగర్, బిగ్ బాస్కెట్ లైన్, ఏజె పాలిమర్స్, టిబ్కో ఇండస్ట్రీస్, సుదర్శన్ ఎంటర్‌ప్రైజెస్ తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సన్మానం



బీసు వెంకటేశంగౌడ్‌ను సత్కరిస్తున్న జైగౌడ్ ఉద్యమ నాయకులు

చింతల్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలు జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు రామారావుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జైగౌడ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కిషోర్‌గౌడ్, అధికార ప్రతినిధి బీసు వెంకటేశంగౌడ్, శంకర్‌గౌడ్, సాయిగౌడ్ తదితరులు హాజరయ్యారు.

కోడి పందేలు ఆడుతున్న నలుగురి అరెస్టు

మూసాపేట: కోడిపందేలు ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెస్ట్ గోదావరి పెనుగొండకు చెందిన చిలకలపల్లి రామకృష్ణ (34), వనపర్తి జిల్లా చిన్న చింతకుంటకు చెందిన ఈ.రమేష్ (36,) కూకట్‌పల్లి సాయిచరణ్ కాలనీలో నివాసముంటున్న కంట్రకొండ మణికొండ (34), ఈస్ట్ గోదావరికి చెందిన బయారపు లక్ష్మణ్ (33) శంషీగూడలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఖాళీ స్థలంలో కోడి పందేలు ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,200 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు కోళ్లు, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్షం పడితే ఇక అంతే !

వర్షం పడ్డ ప్రతిసారి రావడం.. పరిశీలించడం

ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో అధికారులు విఫలం

ఇబ్బందులు పడుతున్న కాలనీల ప్రజలు

నియోజకవర్గంలో కుండపోత వర్షం పడిందంటే చాలు జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. అధికారులకు సరైన ప్రణాళిక లేకపోవడంతో తరచూ రోడ్లపై వరదనీరు పారుతోంది. దీంతో వాహనదారులు వరదనీటిలో రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఈ పరిస్థితి నెలకొంటున్నా అధికారులు శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి..

– కుత్బుల్లాపూర్

వర్షం పడితే.. కార్మికులకు సెలవే..

ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడ జీడిమెట్ల ప్రాంతంలో కూడా వర్షం పడిందంటే చాలు రాకపోకలు నిలిచి పోవాల్సిందే. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్య ఎదురవుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో వివిధ ఉత్పత్తులు కొనసాగించే పరిశ్రమ యజమానులు వర్షం పడ్డ సమయంలో కార్మికులకు సెలవు ప్రకటించి వెళ్లడం పరిపాటిగా మారింది. జీడిమెట్ల ఇండస్ట్రియల్ మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.



జీడిమెట్ల పారిశ్రామికవాడ రోడ్డులో మోకాళ్ల లోతులో వరదనీరు

ఒక్క కారణంతో అధ్వాన పరిస్థితి



గుంతలమయంగా మారిన పేట్‌బషీరాబాద్‌లోని రిలయన్స్ పెట్రోల్‌బంక్ రోడ్డు

మాస్టర్ ప్లాన్‌లో రోడ్డు లేదని ఒకే ఒక్క కారణంతో వివిధ కాలనీలకు వెళ్లే రోడ్డు అధ్వాన పరిస్థితికి చేరింది. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పేట్ బషీరాబాద్ రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి కట్ట మైసమ్మ మీదుగా వివిధ కాలనీలకు వెళ్లే రోడ్డును అపర్ణ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు సీఎస్ఆర్ నిధుల ద్వారా రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో మాస్టర్ ప్లాన్‌లో రోడ్డు లేదన్న ఉద్దేశంతో హెచ్ఎండీఏ అధికారులు పనులు నిలిపివేశారు. దీంతో వర్షం పడ్డ ప్రతిసారి ఇటువైపుగా వచ్చి పోయే వాహనదారులు నరకం చూస్తున్నారు. ఈ రోడ్డు ఏర్పాటు విషయంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లను కలిసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు దష్టి సారించాలని కోరుతున్నారు.

వర్షం పడితే వరదే..



గాజులరామారం నుంచి కూకట్‌పల్లికి వెళ్లే రోడ్డులోని రాంకీ వద్ద

గాజులరామారం నుంచి కూకట్‌పల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు రామ్‌కీ వద్ద వర్షపు నీరు నిలవడం మూలంగా అటువైపుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోడ్డు ఎత్తు వంపులు ఉండటం వల్ల ప్రతి వర్షాకాలంలో ఈ సమస్య ఉత్పన్నం అవుతుంది. గతంలో అధికారులు హడావుడి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో వర్షం పడ్డ ప్రతిసారి ఇక్కడ రోడ్డుపై నీరు నిలవడం పరిపాటిగా మారింది. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగితేనే ఇక్కడ శాశ్వత పరిష్కారం చూపుతారు.

పనులు పూర్తయితేనే..

ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే ప్రధాన రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ వర్షం పడ్డ ప్రతిసారి రోడ్డుపై నీరు నిలుస్తుంది. గతంలో ఇక్కడ 1.60 కోట్లతో 600 ఎంఎం పైప్‌లైన్ వేసినప్పటికీ అది ఒకే సైడు వేయడం వల్ల మరోవైపు పనులు నిలిచిపోయాయి. దీంతో పైపులైన్ వేయకపోవడం మూలంగా అక్కడ అక్రమంగా డబ్బాలు ఏర్పాటు చేసి బిల్డింగ్ మెటీరియల్ డంపింగ్ చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా మరో సైడు పైపులైన్ పనులు పూర్తి చేస్తే పరిష్కారం చూపిన వారవుతారు.



జగద్గిరిగుట్ట- ఐడీపీఎల్ రోడ్డులోని రంగారెడ్డినగర్ బస్టాప్ వద్ద నిలిచిన వరదనీరు

ప్రణాళికలు రూపొందించారు.. అమలు మరిచారు!



వైష్ణవి కాలనీకి వెళ్లే రోడ్డులో ..

జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీలో వర్షం పడ్డ ప్రతిసారి కాలనీ నుంచి ఒక వాహనం బయటకి మరొక వాహనం లోపలికి వెళ్లే పరిస్థితి ఉండదు. గతంలో ఇక్కడ వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. అంతేకాకుండా వరద నీటి కాలువలు హైడ్రా పరిధిలోకి వెళ్లడంతో చేతులెత్తేశారు. దీంతో వర్షం పడ్డ ప్రతిసారి కాలనీవాసులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు.

వారం రోజులు తిప్పలు పడాల్సిందే!

ప్రగతి నగర్ ఆదిత్య గార్డెన్ సిద్ధి బ్లాక్ రోడ్డులో వర్షం పడ్డది అంటే చాలు వారం రోజుల పాటు నరకం అనుభవించాల్సిందే. ఇక్కడ రోడ్డు వేసినప్పటికీ ఎందుకు పనికి రాకుండా పోతుంది. పక్కనే చెరువు ఉన్నప్పటికీ దానికి అనుసంధానంగా రోడ్డు ఎత్తుపల్లాలు వంపులు పాటించకుండా వేయడం వల్ల వర్షం పడ్డ ప్రతిసారి ఈ ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. అధికారులు వచ్చి వెళ్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడం లేదు.



జలమయమైన ప్రగతినగర్ ఆదిత్యగార్డెన్ రోడ్డు

తెలంగాణ కబడ్డీ లీగ్ ఫైనల్ రౌండ్ సెలక్షన్స్



సమావేశంలో మాట్లాడుతున్న కాసాని వీరేష్



పాల్గొన్న క్రీడాకారులు

నిజాంపేట్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ కబడ్డీ లీగ్ ఫైనల్ రౌండ్ సెలక్షన్స్ విజయవంతంగా పూర్తైంది. మొత్తం 220 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. కఠినమైన ఎంపిక ప్రక్రియ అనంతరం అన్ని విభాగాల నుంచి 8 జట్లు ఎంపికయ్యాయి. కార్యక్రమానికి తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, సెలక్షన్ కమిటీ చైర్మన్ అజీజ్‌ఖాన్, సెలక్షన్ కమిటీ సభ్యులు, టెక్నికల్ అధికారుల పర్యవేక్షణలో ఈ ఎంపిక కార్యక్రమం జరిగింది. తెలంగాణ కబడ్డీ లీగ్ ఆగస్టు 28 నుంచి ప్రారంభం కానుందని నిర్వాహకులు తెలిపారు.

పుంజాల శివశంకర్‌కు ఘన నివాళి

కూకట్‌పల్లి: హిందూ బీసీ మహాసభ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో దివంగత నేత పుంజాల శివశంకర్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత సతీష్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రిగా, గవర్నర్‌గా దేశంలో క్లిష్టమైన పరిస్థితుల్లో స్వర్గీయ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీకి ప్రత్యేక సలహాదారుడిగా ఉంటూ దేశం కోసం ఎంతో కృషి చేశారన్నారు. అదే విధంగా బీసీ సంక్షేమం కోసం ఎన్నో కొత్త చట్టాలను, రిజర్వేషన్‌ను అమలు చేయటంలో తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా కార్యక్రమాలను చేపట్టారన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సునీల్(ఫైల్)

కుత్బుల్లాపూర్: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరయాంజాల్‌లోని లేబర్ క్యాంప్‌లో రంజన్‌కుమార్(28) లేబర్‌గా, సునీల్ (28) డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 3న రాత్రి 11 గంటల సమయంలో మద్యం తాగి ఇరువురి మధ్య గ్యాస్ సిలిండర్ విషయమై గొడవ జరిగింది. దీంతో ఇరువురి ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గాయాలయ్యాయి. 7న ఉదయం సునీల్ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాటు తీవ్ర తలనొప్పి రావడంతో అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

కూకట్‌పల్లి: కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీపురం కాలనీ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

కొలన్ నారాయణరెడ్డి అసోసియేషన్ ఎన్నిక



నూతన సభ్యులతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ఎన్నికల ప్రక్రియ నిర్వహించి ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ఎన్నుకోబడ్డ నూతన అసోసియేషన్ బాడీని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం కొలన్ నారాయణరెడ్డి కాలనీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చైర్మన్‌గా చిర్రా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కొలన్ వెంకట్‌రెడ్డి, ప్రెసిడెంట్‌గా విజయ్ కుమార్ గుండాల, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమణారెడ్డి జడ్పీ, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రెడ్డి బిజ్జుల, జనరల్ సెక్రటరీగా రమేష్ వంకుడోత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్‌కుమార్ కావూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరేష్ నల్లూరి, జాయింట్ సెక్రటరీగా నాగిరెడ్డి, హనుమంతు ప్రసాద్, ట్రెజరర్‌గా సుబ్బరాజు, జాయింట్ ట్రెజరర్‌గా జయపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు.

రోడ్డు పైకి నాలా.. నీరు వెళ్లేది ఎలా?

- రోడ్డుకంటే ఎత్తులో నాలా నిర్మాణం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ శంకరయ్య భవానీ ఎన్‌క్లేవ్, రావినారాయణరెడ్డినగర్ వెస్ట్‌లో కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అధికారులు రూ.2 కోట్ల వ్యయంతో 420 మీటర్ల పొడవు మేరా నాలా పనులు చేపడుతున్నారు. అధికారుల ప్రణాళిక లోపంతో చేపడుతున్న నాళ్ల పనులు భవిష్యత్‌లో ఏ మాత్రం ఉపయోగపడదని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా నిర్మిస్తున్న నాలాపై నీరు నిలువ ఉన్నచోట ఇనుప జాలీలు వేసి స్లాబులు వేశారు. కానీ అధికారులు ఏమాత్రం చూసుకోకుండా రోడ్డు కంటే నాలా ఎత్తు నిర్మించడంతో రోడ్డుపై ఉన్న నీరు ఎలా వెళ్తుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 420 మీటర్ల పొడవులో నిర్మిస్తున్న ఈ నాలా పనులు చాలాచోట్ల క్రమ పద్ధతి లేకుండా హెచ్చుతగ్గులతో నాలా స్లాబ్ వేశారని స్థానికులు మండిపడుతున్నారు. స్థానికంగా వర్షపునీరు నిలబడే ప్రాంతాల్లో నాలా స్లాబ్‌ను మరింత పైకి నిర్మిస్తుంటే అధికారులు ఏం చేశారని ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల వర్షం నీరు పడినప్పుడల్లా రోడ్డుపై నీరు నిలవడం ఖాయమన్నారు. సమస్య పరిష్కారం కావాలంటే నాలా స్లాబ్‌ను రోడ్డు కంటే దిగువన ఏర్పాటు చేయాలని లేకుంటే రోడ్డు ఎత్తు అయినా పెంచాలని కోరుతున్నారు.

వెనుకబడిన ప్రాంతాల్లో

అంగన్‌వాడీలు

నూతనంగా 60 అంగన్‌వాడీ కేంద్రాలు

- 30 క్రష్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ప్రభుత్వానికి జిల్లా సంక్షేమ శాఖ ప్రతిపాదనలు
- ఆమోదం లభించగానే ప్రారంభించేందుకు చర్యలు
- బేబీ కేర్ సెంటర్లను తలపించేలా క్రష్ కేంద్రాలు
- జిల్లాలో ప్రస్తుతం 793 అంగన్‌వాడీ కేంద్రాలు, 1.07లక్షల లబ్ధిదారులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలు ,దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలు నివసించే బస్తీలు, పురపాలక సంఘాల్లోని కాలనీల్లో నూతన అంగన్‌వాడీ కేంద్రాలతో సహా క్రస్ (బేబీ కేర్) సెంటర్లను ఏర్పాటు చేసేందుకు జిల్లా సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఇప్పటికే గుర్తించిన వెనుకబడిన ప్రాంతాలు , బస్తీలు, కాలనీల్లో నూతనంగా 60 అంగన్వాడీ కేంద్రాలతో పాటు 30 క్రష్(బేబీ కేర్) సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన జిల్లా సంక్షేమ శాఖ సంబంధిత రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించింది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించగానే, ప్రారంభించేందుకు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నూతన అంగన్‌వాడీ కేంద్రాలు ,క్రష్ సెంటర్ల ఏర్పాటుపై జిల్లాలో అంగన్‌వాడీ ప్రాజెక్టుల వారీగా కొత్త అంగన్‌వాడీ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయడంతో పాటు ప్రాంతాలను గుర్తించారు. నూతనంగా నిర్వహించ తలపెట్టిన అంగన్‌వాడీ కేంద్రాలు , క్రష్ సెంటర్లలో లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలతో సహా 7 నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులు, మూడేళ్ల నుంచి 6 సంవత్సరాల పిల్లలను గుర్తించిన సంక్షేమ శాఖ అధికారులు వారి వివరాలతో కూడిన సమాచారాన్ని రూపొందించారు. వీటి ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన వెంటనే రంగంలోకి దిగేందుకు జిల్లా సంక్షేమ శాఖ అధికారవర్గాలు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

అనువైన కేంద్రాల్లోనే క్రష్ సెంటర్లు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్రష్(బేబీ కేర్) సెంటర్లను అనువైన అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొల్పేందుకు జిల్లా సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటోంది. సొంతభవనం కలిగి ఉండి.. విశాలమైన గదులున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రష్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. తద్వారా చిన్న పిల్లల సంరక్షణ(కేర్) బాగుంటుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారులు భావిస్తున్నారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల్లో చిన్న పిల్లలను కలిగి ఉన్న భార్యభర్తలు కార్మికులుగా లేదా పరిశ్రమలతోపాటు ఇతరతర ఉద్యోగాలు చేసినప్పుడు వారి సంరక్షణ కోసం క్రష్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడగలవని సంక్షేమ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఆయా క్రష్ సెంటర్లలో పిల్లల సంరక్షణ ఏలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

గర్భిణులు, పసికందులకు ప్రాధాన్యం..

చిన్న పిల్లలతోసహా గర్భిణులు, బాలింతల ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడనున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య. ఆరోగ్య రక్షణ చర్యలతో పాటు గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పాత్ర కీలకం కానుంది. ఒకటి నుంచి ఆరు సంవత్సరాల్లోపు పిల్లలు అంగన్వాడీ సెంటర్లకు వస్తారు. పిల్లల పరిశుభ్రత, ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వటం, పౌష్టికాహారం ఇవ్వడం వంటి విధులను వారు నిర్వహిస్తారు. పసి పిల్లల వ్యక్తిగత శుభ్రత విషయంలో హెల్పర్లు జాగ్రత్తలు తీసుకుంటారు.

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల వివరాలు ఇలా..

ప్రాజెక్టు	అంగన్వాడీ కేంద్రాలు	లబ్ధిదారుల సంఖ్య
మేడ్చల్	211	39,463
అల్వాల్	269	20,993
కుత్బుల్లాపూర్	313	47,028
మొత్తం	793	1,07,484

వైభవంగా అమ్మవార్ల బోనాల జాతర

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేటలోని బంగారు మైసమ్మ దేవి ఆలయ బోనాల జాతర ఘనంగా జరిగింది. అదే విధంగా దుండిగల్‌లోని రాజ రాజేశ్వరీ పోచమ్మ దేవతల అమ్మవార్ల బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి బోనాలను సమర్పించి అమ్మవార్ల మొక్కులను చెల్లించుకున్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పూజలు నిర్వహించిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు





హాజరైన ఎంపీ ఈటల రాజేందర్



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు